సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

● బాలానగర్ సీఐ నర్సింహ రాజు



శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రతీ పౌరుడు పోలీసులకు సహకరించాలి. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులెందరో పొట్ట చేతపట్టుకుని బాలానగర్ ప్రాంతానికి వచ్చి పరిశ్రమల్లో కార్మికులుగా పని చేస్తున్నారని, వారి పిల్లల భవిష్యత్ కోసం సదరు కార్మికులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా పిల్లలు కూడా మత్తు పదార్థాలవైపు చూడకుండా వారికి విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులుగా తీర్చి దిద్దాలని సూచించారు. గురువారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో బాలానగర్ సీఐ నర్సింహరాజు పలు విషయాలు వెల్లడించారు.

- బాలానగర్, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి)

సీఐగా బాధ్యతలు చేపట్టాక గమనించిన అంశాలు?

బాలానగర్ పారిశ్రామిక(పోలీస్ స్టేషన్ పరిధి)వాడలో ఎక్కువ శాతంగా పొరుగు రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులే అధికంగా ఉన్నారు. దేశంలో ఎన్ని రాష్ట్రాలు ఉన్నాయో అన్ని రాష్ట్రాలకు చెదిన ప్రజలు బాలానగర్‌లో నివసిస్తున్నట్టు గుర్తించాం.

లా అండ్ ఆర్డర్ సెక్టార్లు ఎన్ని ఉన్నాయి?

బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 4 సెక్టార్లు ఉన్నాయి. 1. రాజుకాలనీ, 2.గౌతమీనగర్, 3. ఐడీపీఎల్ పద్మారావునగర్ 4 గిరినగర్, పంచశీల కాలనీలు ఉన్నాయి.

నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేంటి?

సైబరాబాద్ సీపీ, బాలానగర్ డీసీపీ, ఏసీపీ ఆదేశాలు, సలహాలు, సూచనల మేరకు నేరాల నియంత్రణ కోసం చర్యలు చేపడుతున్నాం. మొదట కాలనీల్లో సీసీ కెమెరాలు ఎక్కడెక్కడ ఉన్నాయి. ఎన్ని పని చేస్తున్నాయనే విషయాలను రాబట్టాం.

పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల పనితీరు?

పీఎస్ పరిధిలో కాలనీ అసోసియేషన్ వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ సరైన మెయింటెనెన్స్ లేకపోవడంతో కొన్ని కెమెరాలు పని చేయడం లేదు. సిబ్బందితో సర్వే చేయించి పలు కాలనీలు, బస్తీల్లో నూతనంగా 599 సీసీ కెమెరాలు పెట్టాలని గుర్తించాం. అలాగే బాలానగర్‌లో కొన్ని కాలనీల అసోసియేషన్ సభ్యులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొస్తున్నారు. వారికి కెమెరాలు ఎలా ఎక్కడ ఏ విధంగా ఏర్పాటు చేయాలో సలహాలు సూచనలు ఇస్తున్నాం. ఐలా, జీడిమెట్ల వారు బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కెమెరాల ఏర్పాటుకు కావాల్సిన సాయం అందిస్తామని ముందుకొచ్చారు. వారి సేవలను వినియోగించుకుంటాం.

ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాలపై...?

బాలానగర్ పీఎస్ పరిధిలో 97 ప్రార్థనా మందిరాలు ఉన్నట్టు సర్వేలో తేలింది. ఇందులో ఆలయాలు 57, చర్చిలు 15, మసీదులు 18, చిల్లాలు, దర్గాలు 8, గురుద్వార్ 1 ఉన్నాయి. వీటిలో 17 ఆలయాలు, 3 చర్చిలు, 2 మసీద్‌లు, గురుద్వార్ వద్ద మాత్రమే సీసీ కెమెరాలు ఉన్నాయి. బుధవారం ప్రార్థనా మందిరాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి, సీసీ కెమెరాలపై అవగాహన కల్పించాం. కెమెరాలు లేని ప్రాంతాల్లో త్వరలో కెమెరాలు ఏర్పాటు చేయిస్తాం.

బాలానగర్ ప్రజలకు మీరిచ్చే మెసేజ్ ఏంటి?

ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు దగ్గరయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కాలనీలు, ఆలయాలు, యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి నేరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలను కోరేదొక్కటే శాంతా భద్రతలకు భంగం కలుగుతుందని భావిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయండి. కేసు నమోదు చేసి వెంటనే చర్యలు తీసుకుంటాం.



పలు అనారోగ్యాలవల్ల చికిత్స పొందుతున్న 24 మంది వారి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మంజూరైన రూ.1,00,300 చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు - హైదర్‌నగర్, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి)

గాడితప్పిన పాలన

- జేఎన్‌టీయూ కాలేజీలో సమస్యలు
- ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్తు
- పట్టించుకోని ప్రిన్సిపాల్
- సెకండియర్ సీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో గందరగోళం
- ఇన్‌చార్జి వీసీ వర్సిటీకి రాకపోవడంతో అధికారుల ఇష్టారాజ్యం

హైదరాబాద్ సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్టుగా తయారైంది జేఎన్‌టీయూలో ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల పరిస్థితి. కంప్యూటర్ సైన్స్‌లో ఫ్యాకల్టీ నిర్లక్ష్యం కారణంగా సుమారు 150మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. బాధిత విద్యార్థులు లబోదిబోమని మొత్తుకుంటున్నా, సంబంధిత విభాగాధిపతికి గానీ, కళాశాల ప్రిన్సిపాల్‌కు గానీ పట్టించుకునే తీరిక లేకుండా పోయింది. యూనివర్సిటీకి ఆరు నెలలుగా రెగ్యులర్ వీసీ లేకపోవడం, ఇన్‌చార్జి వీసీగా ఉన్న ఐఏఎస్ అధికారి యూనివర్సిటీ వైపు కన్నెత్తి చూడకపోవడంతో వర్సిటీలో ఉన్నతాధికారులు, కాలేజీలో ఫ్యాకల్టీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పనులు చేస్తే అదనపు ఆదాయం పుష్కలంగా లభిస్తుండడంతో కళాశాల ప్రిన్సిపాల్ సహా కొందరు విభాగాధిపతులు విద్యార్థుల గురించి పట్టించుకోవడం మానేశారని ఆయా సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పైఅధికారుల బాటలోనే తాము నడుస్తామంటూ సుమారు 40 మంది టీచింగ్ అసిస్టెంట్లు కూడా నెల రోజులుగా విద్యార్థులకు పాఠాలు చెప్పడం లేదని, మరో వారం రోజుల పాటు ఇదేతీరును కొనసాగించే పరిస్థితులు నెలకొన్నాయని చెబుతున్నారు.

మార్క్స్ లిస్ట్ చూసి మైండ్ బ్లాక్

యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులకు పరీక్షా ఫలితాలను సక్రమంగా ఇవ్వడంలో ప్రొఫెసర్లు తరచుగా ఫెయిలవుతున్నారు. ప్రత్యేకించి కళాశాల పరీక్షల విభాగం పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. తప్పుల తడకలుగా ఇచ్చిన మార్కుల జాబితా లు చూసి విద్యార్థులకు మైండ్ బ్లాక్ అయింది. గత జూలైలో నిర్వహించిన సెకండియర్ వి ద్యార్థుల సెమిస్టర్ ఫలితాలను మూడు నెలలు ఆలస్యంగా అక్టోబరు 28న విడుదల చేశారు. ఆలస్యం అయినప్పటికీ అధికారులు ఫలితాలను సక్రమంగా ఇవ్వలేకపోయా రు. కం ప్యూటర్ సైన్స్ విభాగంలో రెగ్యులర్ బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్ విద్యార్థులు మొత్తం 150మంది ఉండగా, అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా వారిలో ప్రతి ఒక్కరికీ 10 నుంచి 20మార్కుల మేర కోత పడింది. తీవ్రమైన ఆందోళనకు గురైన విద్యార్థులు ఈ విషయాన్ని సీఎస్ఈ విభాగాధిపతి దృష్టికి తెచ్చినప్పటికీ తానేమీ చేయలేనని చేతులెత్తేశారు.



యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్

మిడ్ మార్కులను.. ముంచేశారు

ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆర్ 22 రెగ్యులేషన్స్ ప్రకారం సెమిస్టర్ పరీక్షల్లో 40శాతం ఇంటర్నల్, 60శాతం మార్కులకు ఎక్స్‌టర్నల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇంటర్నల్ పరీక్షల్లో రెండు దఫాలుగా మిడ్ పరీక్షలు నిర్వహించి, వాటిలో వచ్చిన మార్కుల సగటును ఎక్స్‌టర్నల్ పరీక్షల్లో వచ్చిన మార్కులకు కలుపుతారు. అయితే, సెకండియర్ సెకండ్ సెమిస్టర్‌లో విద్యార్థులు రాసిన రెండు మిడ్ పరీక్షల్లో ఒక మిడ్ మార్కులను మాత్రమే కలిపి సగటును తీసుకోవడంలో కొందరు ప్రొఫెసర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. తమకు అదనపు ఆదాయం తెచ్చే పనుల్లో బిజీగా ఉండడంతో అసలు పనిపై అశ్రద్ధ కనబరిచారు. దీంతో ఒక మిడ్‌లో వచ్చిన మార్కుల్లో సగం మార్కులనే ఇంటర్నల్ మార్కులుగా చూపారు. ఫలితంగా 50మందికి పైగా విద్యార్థులు ఫెయిలవగా, మరో వంద మంది విద్యార్థులకు 10 నుంచి 20మార్కులు తక్కువగా రావడంతో విస్తుపోయారు. అదనపు ఆదాయాన్ని తెచ్చిపెట్టే పనుల కారణంగా విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకునేందుకు ప్రిన్సిపాల్, విభాగాధిపతి తగినంత సమయం కేటాయించ లేకపోయారు. విద్యార్థి సంఘాలు ఆందోళనకు ఉపక్రమించడంతో కళ్లు తెరిచిన ఉన్నతాధికారులు జరిగిన తప్పిదంపై విచారణకు కమిటీ వేశారు. కమిటీ వేసి వారం గడుస్తున్నా బాధ్యులపై చర్యలు తీసుకోవడం గానీ, విద్యార్థుల సమస్యకు పరిష్కారం చూపడంగానీ జరగలేదు. సుమారు ఎనిమిదివేల మంది విద్యార్థుల ఆలనా పాలన చూడాల్సిన ప్రిన్సిపాల్‌ను పబ్లిక్ సర్వీస్ కమిషన్ కన్వీనర్‌గా నియమించడమేంటని విద్యార్థి సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై వర్సిటీ రిజిస్ట్రార్‌ను వివరణ కోరగా, ఈ అంశం తన దృష్టికి రాలేదని, ప్రిన్సిపాల్‌తో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.



కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.23, వంకాయ రూ.45, బెండకాయ రూ.45, పచ్చి మిర్చి రూ.35, బజ్జి మిర్చి రూ.70, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.38, క్యాబేజీ రూ.31, బీన్స్ రూ.50, క్యారెట్ రూ.67, గోబి పువ్వు రూ.23, దొండకాయ రూ.23, చిక్కుడు కాయ రూ.65, గోరు చిక్కుడు రూ.50, బీట్‌రూట్ రూ.53, క్యాప్సికం రూ.65, ఆలుగడ్డ రూ.39, కీర రూ.16, దోసకాయ రూ.35, సొరకాయ రూ.25, పొట్లకాయ రూ.18, కంద రూ.65, ఉల్లి పొరక రూ.55, ఉల్లిగడ్డ రూ.45, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామ గడ్డ రూ.37, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.30, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.8-10, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ. 160, వెల్లుల్లి రూ.380, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.80, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.70, లోబా రూ.45, ఆ కాకరకాయ రూ.90. పైన పేర్కొన్న ధరలు శుక్రవారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఘనంగా బాలల దినోత్సవం

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్, కేపీహెచ్‌పీ డివిజన్లలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఆట, పాటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

- కూకట్‌పల్లి జోన్ బృందం, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి)



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహ యాదవ్, రాజేశ్వర్ శర్మ

ఓల్డుబోయినపల్లి, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): బాల్యదశనుంచే చిన్నారులు మంచి నడవడిక, క్రమ శిక్షణను అలవరచుకొని భవిష్యత్తులో ఉన్నత పదవులను అధిరోహించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, కామారెడ్డి ప్రభుత్వ పాఠశాల రిటైర్డు హెచ్‌ఎం విఠాల రాజేశ్వర్ శర్మ విద్యార్థులకు సూచించారు. ఓల్డుబోయినపల్లి డివిజన్ సమతానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో వారు ప్రసంగించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు వారు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమతానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మూసాపేట్‌లోని పంచశీల పాఠశాలలో జరిగిన చిల్డ్రన్స్ డే వేడుకలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



● ఆకార్ ఆషా హాస్పిటల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా గురువారం చిన్మయ విద్యాలయ విద్యార్థులకు ఫస్ట్ ఎయిడ్, లైఫ్ సేవర్ గురించి వివరించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునే లక్షణాలు ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆకార్ ఆషా హాస్పిటల్ ఏవో లిపికా గుప్తా ఆధ్వర్యంలో వైద్యులు సూచించారు.

- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి)



మాధవరం నగర్‌లోని ఓ పాఠశాలలో హ్యాపీ చిల్డ్రన్స్ డే ఆకారంలో కూర్చున్న విద్యార్థులు



బాలల దినోత్సవం సందర్భంగా బాలాజీనగర్ డివిజన్ కైత్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు - కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి)

టీడీపీ సభ్యత్వ నమోదు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందని, తెలంగాణలో ఉన్న ఓటర్లతో పాటు ఏపీలోని ఓటర్లు కూడా తమకు సభ్యత్వం ఇవ్వండని అడుగుతున్నారని మల్కాజిగిరి పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యురాలు పద్మా చౌదరి అన్నారు. ఈమేరకు స్థానిక నాయకులు వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, చిరుమామిళ్ల ఉమా, సుబ్బారావు, బత్తుల వేణితో కలిసి గురువారం కేపీహెచ్‌బీ ఏడోఫేజ్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. తొలిరోజే 100 సభ్యత్వాలు ఇచ్చామని, టీడీపీ కుటుంబంలో సభ్యులుగా చేరేందుకు ఇదొక మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో షేక్ సత్తార్, కేతినేని కిషోర్, కాకర్ల గోపీకృష్ణ, కంఠమనేని అశోక్, వీరమాచనేని ఉషా, వెంకటరత్నం, కోటేశ్వర రావు, రేఖ తదితరులు పాల్గొన్నారు.



ఏడోఫేజ్‌లో సభ్యత్వాలు అందజేస్తున్న పద్మాచౌదరి

సమస్యలు పరిష్కరించుకుందాం

బాలానగర్, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): చిత్తారమ్మబస్తీ డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో సమస్యలు వస్తే కలిసికట్టుగా వాటిని పరిష్కరించుకోవాలని చిత్తారమ్మబస్తీ డబల్ బెడ్రూం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.శాఖయ్య నివాసితులకు, కమిటీ సభ్యులకు సూచించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం ఏర్పడి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని కేక్ కట్‌చేసి ప్రసంగించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రేకులు, పూరిగుడిసెలతో ఉన్న బస్తీ ఇపుడు తొమ్మిదంతస్తుల భవనంతో రాజసాన్ని ప్రదర్శిస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణానికి సహకరించిన మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కృష్ణారావుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కృష్ణయాదవ్, సామియెల్, డి.సత్తయ్య, డి.ప్రసాద్, ఎం.దినేష్, ఎం.కృష్ణ, వెంకటేశ్, అనురాధ, అరుణ, సరోజ నివాసితులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులతో కలిసి కేకుకట్ చేస్తున్న శాఖయ్య

విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ వసంతనగర్ సెక్షన్ పరిధిలో శుక్రవారం వినాయకనగర్ ఫీడర్ పరిధిలో ఏబీ కేబుల్ వేయనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ వాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గోకుల్ ప్లాట్స్ వినాయక పార్క్, వెంకటరమణ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

డయల్ యువర్ డీఎం

ఫతేనగర్, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిలు తమ సమస్యలను నేరుగా డీఎంకు వివరించేందుకు శుక్రవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో డీఎం డి.హరి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ఫోన్‌లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటున్నట్టు ఆయన చెప్పారు. సమస్యలు తెలియజేయాలనుకునే వారు 9959226151 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు, సలహాలు తెలియజేయవచ్చని ఆయన స్పష్టం చేశారు.

రామలింగాచారికి విశ్వకర్మ లీడర్ అవార్డు

ఓల్డుబోయినపల్లి, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్ దుబైగేటుకు చెందిన లోహశిల్పి పిట్లం రామలింగాచారి విశ్వకర్మలీడర్ అవార్డును అందుకున్నారు. బుధవారం రాత్రి ఢిల్లీలోని డా. బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, బీజేపీ సీనియర్ నాయకుడు టి. ఆచారి, విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఫౌండర్ చీఫ్ ఫౌండర్ విశ్వనాథుల పుష్పగిరి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రామలింగాచారి మాట్లాడుతూ... బాలరాముడి పాదుకల తయారీ తనకు దేశవ్యాప్తంగా గుర్తింపును తెస్తే, ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. తనను ఈ అవార్డుకు ఎంపిక చేసిన విశ్వకర్మ నాలెడ్జి సెంటర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



ఎంపీ మల్లు రవి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న లోహశిల్పి రామలింగాచారి

ముగిసిన పవిత్రోత్సవాలు

సర్దార్‌పటేల్‌నగర్‌లోని శ్రీలక్ష్మీ గోదా దేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం, సాయంత్రం అర్చకులు మంత్రోచ్చరణాల మధ్య స్వామివార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మూడు రోజులుగా పూజల్లో పాల్గొన్న భక్తులకు సాయంత్రం పవిత్రం అందజేశా రు. మధ్యాహ్నం అన్న సమారాధనకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



- కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి)

బాబా ఆలయాలకు పోటెత్తిన భక్తులు



బాలానగర్ ఐడీపీఎల్ సాయిబాబా ఆలయం, సాయినగర్ నాయినాగేంద్ర ఆలయంలో గురువారం భక్తులు పోటెత్తారు. కార్తీక గురువారం కావడంతో పెద్ద సంఖ్యలో మహిళలు కుటుంబ సభ్యులతో ఆలయానికి వచ్చి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

- బాలానగర్, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి)







గోడలపై చిత్రక్రీడ.. భళా..



కేపీహెచ్‌బీ రాజీవ్ గాంధీ ఫ్లైఓవర్ పిల్లర్లకు వేసిన వివిధ రంగాల చిత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.





జంట సర్కిళ్లలో పెరుగుతున్న ఆరోగ్య స్పృహ

● వాకింగ్, యోగాపై స్థానికుల ఆసక్తి


యోగా చేస్తున్న యువకులు

షాపూర్‌నగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బమ్ చిక్ బమ్ చిక్ బమ్ బమ్ చేయి బాగా... వంటికి యోగా మంచిదేగా అని ఓ సినీ రచయిత రాసినట్టు యోగా సర్వరోగ నివారిణి. ఉరుకు పరుగుల జీవితంలో సరైన వ్యాయామం లేక మనిషి ఆరోగ్య పరిస్థితి విషమిస్తోంది. చదువులు, ఉద్యోగాలతో, ప్రతి ఒక్కరు ఒత్తిడికి గురవుతున్నారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రోజులో కొంత సమయమైన యోగా, వ్యాయామం, ధ్యానం చేయాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కోవిడ్ పరిస్థితులను ఎదుర్కొన్న జనం వీటిపై మరింత ఆసక్తిని కనపరుస్తున్నారు. వీటిని అధిగమించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోంది. గ్రామాల్లో కన్నా పట్టణాలలో ప్రజలు రోజువారి పనులతో బిజీగా గడపడంతో వారికి సమయం లేకుండా పోతుంది. పట్టణ ప్రజలు ఎక్కువగా వ్యాయామంపై దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళలో పార్కులు, వాకింగ్ లేఅవుట్‌లలో వ్యాయామం చేస్తూ కనిపిస్తారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంటసర్కిళ్ళలో పలువురు వాకింగ్ వ్యాయామానికి ప్రత్యేక సమయాన్ని కేటాయిస్తున్నారు. గాజులరామారం, మెట్కానిగూడ, హెచ్ఏఎల్ కాలనీ, ఆదర్శనగర్, ఉషోదయకాలనీ, గాజులరామారం గ్రామం, శారదాకాలనీ, కూన మహలక్ష్మీనగర్ తదితర ప్రాంతాలవారు ఒక అసోసియేషన్‌గా ఏర్పడి కొన్ని సంవత్సరాలుగా వ్యాయామం చేస్తున్నారు.

ఆసనాలతో ఆరోగ్యం

యోగాలో వివిధ ఆసనాలు వేయడం ద్వారా ఆరోగ్యానికి రక్షణ కలుగుతుంది. ఒక్కో ఆసనం ద్వారా ఒక్కోరకమైన అనారోగ్య సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రతి రోజు యోగా చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు తోడ్పడుతుంది.యోగాకు ఆదరణ పెరుగుతుండడంతో శిబిరాల ద్వారా ప్రజల్లో ఆసక్తిని పెంచేందుకు యోగా గురువులు కృషిచేస్తున్నారు.

యోగతో ఉపయోగాలు

- **తాడాసనం:** ఎత్తు పెరగడానికి సహకరిస్తుంది. పొత్తికడుపు, వెన్నెముక నిటారుగా సాగడం ద్వారా జీర్ణకోశం పరిశుభ్రమవుతుంది. పేగులు, కాళ్ళు, మోకాళ్ళు చీలమండలం సడలించబడుతుంది.
- **వృక్షాసనం:** తొడ, పిక్క కండరాలకు రిలీఫ్ కలుగుతుంది. జీర్ణశక్తి పెరుగుతుంది. కాళ్ళు కండరాలు బలవర్ధకంగా తయారవుతాయి.
- **వజ్రాసనం:** తొడ, పిక్క కండరాలు బలవర్ధకం అవుతాయి. ఆయాసం తగ్గుతుంది.
- **భుజంగాసనం:** అధికశ్రమ వల్ల కలిగే నడుం నొప్పులు తొలగిపోతాయి. వెన్నెముకకు ఆధారమై నిటారుగా ఉంటుంది. ఆయాసం తగ్గుతుంది. అధికశ్రమ వల్ల కలిగే నడుం నొప్పులు తగ్గుతాయి.
- **పవన ముక్తాసనం:** పవనం అనగా గాలి, ముక్తా అంటే విడిచిపెట్టడం. కడుపులో చెడు గాలిని బయటకు విడిచి పెట్టడం ఈ ఆసనం ప్రత్యేకత. మలబద్ధకం తురుచూ వచ్చే తేన్పులు తగ్గి జీర్ణశక్తి వృద్ధి చెందుతుంది.
- **ప్రాణాయమం:** గాలి రాకపోకలను క్రమపరుస్తుంది. మనస్సును ఏకాగ్రత పరుస్తుంది. అధికరక్తపోటును నివారిస్తుంది.
- **భ్రామరీ ప్రాణాయామం:** ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది.


వాకింగ్ చేస్తున్న వాకర్స్


యోగ చేస్తున్న యువతులు

దినచర్యగా అలవర్చుకోవాలి

గత 15 సంవత్సరాలుగా వ్యాయామం చేస్తున్నాను. దీనిని దినచర్యగా అలవర్చుకోవాలి. మెట్‌కానీగూడ చుట్టుపక్కల కొంత మంది జట్టుగా ఏర్పడి మెట్‌కానీగూడ వాకింగ్ లేఅవుట్‌లో వ్యాయామం చేస్తాం. కరోనా సమయంలో కూడా ఇంటిలోనే వ్యాయామం చేశాను. ప్రతి ఒక్కరు జీవనశైలిలో వ్యాయామాన్ని ఒక భాగంగా చేసుకుని, ఆయుష్షును పెంపొందించుకోవాలి.



– ఈగ చిన్న ఆంజనేయులు, మెట్‌కానీగూడ

సమయాన్ని వెచ్చించండి

ప్రతి ఒక్కరికీ యోగా అవసరం. భారత ప్రభుత్వమే పలు యోగ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. సమయం వృథా అనుకోకుండా ఉదయాన్నే నిద్రమత్తును వీడి రోజువారి ఆరోగ్యానికి గంట సమయాన్ని వెచ్చిస్తే పనిలో చురుగ్గా ఉంటాం.



– పద్మారావ్ సాగర్, గాజులరామారం

సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించిన మేయర్


కొబ్బరికాయ కొట్టి సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ కొలన్ నీలారెడ్డి

నిజాంపేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ 21వ డివిజన్ సాయినగర్‌లో ఆర్టీకే కల్వర్టు నుంచి దుర్గమ్మ ఆలయం వరకు రూ. 2 కోట్లకు పైగా వెచ్చించి నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లైన్, మరో రూ.99 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మేయర్ కొలన్ నీలారెడ్డి కమిషనర్ సాబేర్ అలీ, ఇతర అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, ఏఈ ప్రవీణ్‌కుమార్, డీఈలు నళిని, దాసయ్య, ఇంజనీర్ సుకృత, కాలనీ వాసులు ఉన్నారు.

మరో కార్యక్రమంలో

సాయినగర్‌లో డప్పింగ్ యార్డ్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న డీఆర్‌సీసీ డ్రై రిసోర్స్ కలెక్షన్‌ను గురువారం మేయర్ కొలన్ నీలారెడ్డి కమిషనర్, అధికారులతో కలిసి పర్యవేక్షించారు. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని మేయర్ ఇంజనీర్లకు సూచించారు.


సాయినగర్‌లో డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న మేయర్

రాజీవ్‌గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

నిజాంపేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్, బాచుపల్లి రాజీవ్‌గాంధీ నగర్‌లో వాసవి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఆదర్శన్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి సహకారంతో ఈ నెల 17 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆస్పత్రి ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ లావణ్య తెలిపారు. శిబిరంలో జీఆర్‌బీఎస్, సీబీపీ, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఉచిత వైద్య శిబిరంలో మేనేజింగ్ డెరెక్టర్ శిరీషా, డాక్టర్ అరుణ, ఆదర్శన్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


బీపీ చెక్ చేస్తున్న డాక్టర్

బాలల దినోత్సవం

రంగారెడ్డినగర్ డివిజన్, నందానగర్, శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో జరిగిన బాలల దినోత్సవంలో పాల్గొన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కేఎం ప్రతాప్.
– గాజులరామారం (ఆంధ్రజ్యోతి)



వ్యాస రచన పోటీలు

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గాజులరామారం జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ఉపన్యాసాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యయులు అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
– గాజులరామారం (ఆంధ్రజ్యోతి)



జీవన విధానంలో మార్పులతో మధుమేహాన్ని నియంత్రించవచ్చు


డాక్టర్ జీజెడి రావు

హైదరాబాద్ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, పెరిగిన ఊబకాయం కారణంగా మధుమేహం బారిన పడే వారి సంఖ్య పెరుగుతుందని మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి జనరల్ మెడిసిన్ డాక్టర్ జీజేడీ రావు తెలిపారు. మధుమేహాన్ని నివారించడం సంక్లిష్టంగా ఉండాల్సిన అవసరం లేదని, రోజువారీ మార్పులు చేసుకుంటే నియంత్రించవచ్చునని ఆస్పత్రిలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పేర్కొన్నారు. యువత, పిల్లలలో మధుమేహం ఆందోళనగా మారుతోందన్నారు. తక్కువ గ్లైసెమిక్ ఆహారం, అధిక ఫైబర్ కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లపై దృష్టి పెట్టాలని, చక్కెర, శుద్ధి చేసిన పిండి పదార్థాలను నివారించాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడానికి కనీసం శారీరక శ్రమను లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని రాస్తారోకో



రాస్తారోకోలో పాల్గొన్న స్థానికులు, విద్యార్థులు

జీడిమెట్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సూరారంకాలనీలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగునీటిని అరికట్టడంలో అధికారులు, పాలకులు పూర్తిగా విఫలమయ్యారని, దీనికి నిరసనగా గురువారం విద్యార్థులు, స్థానిక ప్రజలు రాస్తారోకో నిర్వహించారు. ఏళ్ల తరబడి మురుగునీరు రోడ్డుపై పారుతోందని, సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం బాలల దినోత్సవంలో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు, అడ్డా కూలీలు, స్థానికులు ఎక్కడి వాహనాలను అక్కడే నిలిపివేసి స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సత్వరమే సమస్యను పరిష్కరించకుంటే శాశ్వతంగా రోడ్డును మూసివేస్తామని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న సుభాష్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అక్కడికి చేరుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

జీడిమెట్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డిపో పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ కె.ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా జీడిమెట్ల, గండిమైసమ్మ ప్రజలు ఆర్టీసి బస్సు సర్వీసు సేవలకు సంబంధించి తమ సమస్యలతో పాటు, సూచనలు, సలహాలను తెలిపేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతున్నారు. 9959226150 ఫోన్ నంబర్లో సంప్రదించి సమస్యలను తెలిపాలని ఆయన కోరారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు.


డిపో మేనేజర్ ఆంజనేయులు

దంత సమస్యలు రాకుండా ఉండాలంటే..

దంత సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సమస్య వస్తే తీసుకోవాల్సిన చికిత్సలను దంతవైద్య నిపుణురాలు డాక్టర్ పి.రూపారెడ్డి ఆంధ్రజ్యోతితో పలు విషయాలను వెల్లడించారు.
– గాజులరామారం, (ఆంధ్రజ్యోతి)



- **దంత సమస్య రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి?**

రోజూ రెండుసార్లు బ్రష్ చేసుకోవాలి. క్లోరైడ్ టూత్ పేస్టును వాడి, నోటిని శుభ్రంగా ఉంచుకొని, మౌత్ వాష్ చేయాలి. పొగతాగేవారు అలవాట్లను తగ్గించుకొని, నాలుకను శుభ్రంగా ఉంచుకోవాలి.

- **బ్రష్ చేయడానికి ఎంత సమయాన్ని కేటాయించాలి?**

పళ్లు తోమేటప్పుడు ఎక్కువ సమయం తీసుకోవాలి. కనీసం 2 నిమిషాలు పాటు తప్పని సరిగా బ్రష్ చేసుకోవాలి.

- **పంటినొప్పి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?**

నొప్పి ఉపశమనానికి ఉప్పు కలిపిన గోరువెచ్చని నీటితో పుక్కిలించాలి. బాగా చల్లగా, వేడి ఆహారం తీసుకోకపోవడం మంచిది.

- **ఎత్తు పళ్లు ఉన్న వారు ఏమి చేయాలి?**

ఎత్తు పళ్లు, ఎగుడు దిగులు పళ్ళ, పళ్ల మధ్య గ్యాప్ ఉన్నవారు సరి చేసుకోవడానికి క్లిప్(ఆర్థో డెంటిక్) ట్రీట్‌మెంట్ చేయించుకోవాలి.

- **చిగుళ్ల సమస్యలు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

మృదువైన బ్రిసిల్స్ ఉన్న టూత్ బ్రష్‌ను వాడాలి. పొగతాగడం, పొగాకు నమలడం తగ్గించుకోవాలి.

సరైన ఓరల్, ఐజెన్ లేకపోతే చిగుళ్ల దగ్గర పొర ఏర్పడి చిగుళ్ల వాపు, రక్తం కారడం వంటివి వస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే డెంటిస్టును సంప్రదించి, వైద్యం చేయించుకోవాలి.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

జీడిమెట్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అఖిల భారత దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) 2వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.ఏ సురత్నం పిలుపునిచ్చారు. 2025 జనవరి 5, 6, 7 తేదీల్లో నగరంలో జరిగే మహాసభల పోస్టర్‌ను జగద్గిరిగుట్టలో గురువారం ఆవిష్కరించారు. దేశంలో జరుగుతున్న అవినీతి అక్రమాలు ఎండగట్టాలంటే ఒక దళిత బహుజనులకు మాత్రమే సాధ్యమన్నారు. ఈరోజు దేశంలో మహిళలు, దళితులు, మైనార్టీలు, చిన్నపిల్లలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని, దీనంతటికి కారణం పాలకుల నిర్లక్ష్యమేనని ఆయన అన్నారు. కులవివక్షత, కుల నిర్మూలన కోసం ఎస్సీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభల్లో దేశవ్యాప్తంగా వెయ్యిమంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చర్లపల్లి రాములు, ఎల్లయ్య, ముసలయ్య, రవి, సామేలు, ఆశప్ప, యాదగిరి, నరసింహులు, శ్రీను, రాజు, ఆరోగ్యం పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించిన సురత్నం

మార్కెట్‌కు కార్తీక శోభ

శుక్రవారం కార్తీక పౌర్ణమి నేపథ్యంలో పూజా సామాగ్రి కొనుగోలు కోసం వచ్చిన జనంతో కిటకిటలాడుతున్న జగద్గిరిగుట్ట మార్కెట్ ప్రాంతం.


కళకళ లాడుతున్న జగద్గిరిగుట్ట మార్కెట్ ప్రాంతం


పూజా సామగ్రితో మహిళ


పూజలో పెట్టడానికి ఉసిరి కొమ్మలు కొనుగోలు చేస్తున్న మహిళలు

కాజేసిన డబ్బు బాధితుడి ఖాతాలోకి

- క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని సైబర్ నేరగాళ్ల మోసం
- ఆ డబ్బుతో ఫ్లిప్‌కార్టులో కొనుగోళ్లు

హైదరాబాద్ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మోసపూరితంగా నగరవాసి నుంచి నేరగాళ్లు కాజేసిన డబ్బును సైబర్ క్రైం పోలీసులు బాధితుడి ఖాతాలో జమ చేయించారు. బ్యాంకు అధికారులమంటూ నగరానికి చెందిన వ్యక్తికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని చెప్పారు. వారి సూచనల మేరకు వాట్సప్‌లో పంపిన లింక్‌ను ఓపెన్ చేసి వివరాలు నమోదు చేశాడు. ఆ లింక్ ద్వారా మాల్‌వేర్‌ను మొబైల్‌లోకి జొప్పించిన సైబర్‌నేరగాళ్లు మొబైల్‌ను తమ నియంత్రణలో తెచ్చుకొని అతడి క్రెడిట్‌కార్డు నుంచి రూ.1,18,196 కొనుగోళ్లు చేశారు. విషయం తెలుసుకున్న బాధితుడు పోలీసులను సంప్రదించాడు. దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైం పోలీసులు మొబైల్‌లో ఉన్న మాల్‌వేర్‌ను తొలగించి, ఎన్‌సీఆర్‌పీలో వివరాలు నమోదు చేశారు. కాజేసిన డబ్బుతో ఫ్లిప్‌కార్ట్‌లో కొనుగోళ్లు జరిగినట్లు గుర్తించిన సైబర్ క్రైం పోలీసులు సదరు ఈకామర్స్ సంస్థను సంప్రదించారు. మోసపూరితంగా కాజేసిన డబ్బుతో కొనుగోళ్లు జరిగాయని వారికి వివరించి, నగదు బదిలీని నిలిపివేశారు. ఈకామర్స్ సంస్థ ప్రతినిధుల సాయంతో కాజేసిన డబ్బును బాధితుడి ఖాతాలో జమ చేయించారు. సైబర్ నేరగాళ్ల బారినపడి డబ్బులు పోగొట్టుకున్న బాధితుడికి తిరిగి డబ్బు ఇప్పించడంలో కీలకంగా వ్యవహరించిన సిబ్బందిని సీపీ సీవీ ఆనంద్ అభినందించారు.

రిజిస్ట్రేషన్ల పునరుద్ధరణకు గ్రీన్ సిగ్నల్

కుత్బుల్లాపూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్‌లో వక్ఫ్‌బోర్డు భూముల పేరుతో సర్వే నంబర్లు 58-226 నిలిపివేసిన రిజిస్ట్రేషన్లను పునరుద్దరిస్తున్నట్టు వక్ఫ్‌బోర్డు స్వయంగా రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ రాసినట్టు బీజేపీ నాయకులు ఆకుల సతీష్ పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం తప్పేనని వక్ఫ్ బోర్డు అంగీకరించదని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ భూముల్లో వక్ఫ్‌బోర్డు పెత్తనం చేస్తూ నిలిపివేసిన రిజిస్ట్రేషన్లపై ఆదివారం పాదయాత్ర చేపట్టడానికి సిద్ధంకావడంతో వక్ఫ్‌బోర్డు దిగివచ్చిందని తెలిపారు. ప్రజలు ఇప్పటి నుంచి భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

దేశానికి నెహ్రూ చేసిన సేవలు మరువలేనివి

జీడిమెట్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నవభారత నిర్మాత, భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సేవలు మరువలేనివని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య అన్నారు. నెహ్రూ జయంతి సందర్భంగా జగద్గిరిగుట్టలో నిర్వహించిన కార్యక్రమంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జి.వరమ్మ, ఎం.జనార్ధన్, గూడ సాయిప్రవీణ్‌గౌడ్, యాదగిరి, సులోచన, తిరుపతమ్మ, మంగ, హనుమంతు, శేఖర్ పాల్గొన్నారు.



నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గూడ ఐలయ్య

గ్రామకంఠ స్థలాలకు సర్టిఫికెట్లు మంజూరు చేయాలి : బీజేపీ


తహసీల్దార్ మతిన్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు

దుండిగల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దుండిగల్, మున్సిపాలిటీలోని బౌరంపేట్, మల్లంపేట్, దుండిగల్, గాగిల్లాపూర్, బహదూర్‌పల్లి, డి.పోచంపల్లి, శంభీపూర్, నాగులూరు గ్రామాల్లో ఊరు పుట్టిన నాటి నుంచి గ్రామం కఠం భూముల్లోనే ప్రజలు నివాసాలు ఉంటున్నారు. మారిన పరిస్థితులకు అనుకూలంగా నూతన ఇంటి నిర్మాణం, లోన్ కోసం, క్రయ విక్రయాలు చేయాలన్నా గ్రామకంఠం సర్టిఫికెట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు తహశీల్దార్ మతిన్‌కు వినతి పత్రం అందజేశారు. అవసరమైతే గ్రామాల్లో రెవెన్యూ మేళాలు ఏర్పాటు చేసి, ఉన్న ఇళ్లను, ఇంటి స్థలాలను అధికారుల ద్వారా సర్వే చేయించి, సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ఈ సందర్భంగా కోరారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఆకుల సతీష్, జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, కోశాధికారి కీసరి కృష్ణారెడ్డి, మల్లేష్ యాదవ్, బీజేపీ నాయకులు నర్సింహచారి, ప్రభాకర్‌రెడ్డి, సీతారామ్‌రెడ్డి, ఎంబరి ఆంజనేయులు, ఆకుల విజయ్, భానుగౌడ్, యశ్వంత్ పటేల్, రోజా, వెంకటేష్‌నాయక్ ఉన్నారు.

కులగణన సర్వేకు కార్మికులంతా సహకరించాలి

● చింతల నాగరాజు


సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక నాయకుడు చింతల నాగరాజు

జీడిమెట్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో కార్మికులంతా పాల్గొని ప్రభుత్వం చేపడుతున్న మంచి పనికి అందరూ సహకరించాలని ఐఎన్‌టీయూసీ కార్మిక నాయకుడు చింతల నాగరాజు కోరారు. బుధవారం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని కార్యాలయంలో వివిధ కంపెనీల జనరల్ సెక్రెటరీలు, కంపెనీ యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్మికులంతా వివరాలు తెలియచేసి ఆరు గ్యారంటీల పథకాలను పొందాలని, సర్వే సమయంలో కార్మికులకు యాజమాన్యాలు అనుమతినిచ్చి సర్వేలో పాల్గొనే విధంగా సహకరించాలని కోరారు. కులగణన వల్ల రాబోయే ఎన్నికల్లో బీసీలు, ఇతర కులాలు రిజర్వేషన్లు పొంది ఎన్నికల్లో పోటీ చేయవచ్చునన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద, బడుగుల సంక్షేమం కోసం పాటుపడే ప్రభుత్వమని అన్నారు.

71వ అఖిల భారత సహకారశాఖ వార్షికోత్సవం

గాజులరామారం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అఖిలభారత సహకారశాఖ 71వ వార్షి కోత్సవాన్ని రంగారెడ్డినగర్ డివిజన్, ఆదర్శనగర్ కో-ఆపరేటివ్ సొసైటీలో సంఘం సభ్యులు నిర్వహించారు. అనంతరం వారు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శంకరయ్య మాట్లాడుతూ ఈ వార్షికోత్సవం ఏడురోజుల పాటు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు దుర్గ ఆంజనేయులు, రవికుమార్, శేఖర్, కోటేశ్వరరావు, నారాయణ, శివలాల్, చంద్రలీల, యాదగిరి, జయరామ్ పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కో-ఆపరేటివ్ సొసైటీలో సభ్యులు



కాలనీ వాసులు, అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

సమస్యలను పరిష్కరిస్తా : కార్పొరేటర్ నార్నె

హైదర్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ రాంనరేష్‌నగర్‌లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ అధికారులతో, కాలనీ వాసులతో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాం నరేష్‌నగర్ కాలనీ వాసులు ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని ఈ రోజు కాలనీలో పర్యటించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. కాలనీ వాసులందరూ సమష్టి కృషితో కాలనీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న పనులతో పాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని కార్పొరేటర్ పేర్కొన్నారు.



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, కాలనీల వాసులు

నిధులు మంజూరు చేయాలి

హైదర్‌నగర్, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని గురువారం కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనులతో పాటు చేయాల్సిన అభివృద్ధి పనులు వెంటనే పూర్తిచేయాలని కార్పొరేటర్ కోరారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి పత్రంలో వివరించారు. దీనికి స్పందించిన గాంధీ మాట్లాడుతూ అభివృద్ధి పనులు పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా కాలనీల వాసులు పాల్గొన్నారు.



ఎంఓయూ కార్యక్రమంలో ఘెంట్ యూనివర్సిటీ ప్రతినిధులతో హెచ్‌సీయూ వీసీ బీజేరావు, ప్రొఫెసర్ రమేశ్ తదితరులు

నీలగిరి పురావస్తు ప్రాజెక్టుపై అధ్యయనం

● బెల్జియం యూనివర్సిటీతో హెచ్‌సీయూ ఒప్పందం

హైదరాబాద్ సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బెల్జియంలోని ఘెంట్ యూనివర్సిటీ సహకారంతో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నీలగిరి పురావస్తు ప్రాజెక్టును చేపట్టింది. ఈ రెండు యూనివర్సిటీల ప్రతినిధులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా భాష, సంస్కృతి మధ్య సంబంధంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. భాషకు సంబంధించి సామాజిక గుర్తింపులు, సాంస్కృతిక పద్ధతులను పరిశీలించనున్నారు. సాంస్కృతిక సందర్భాలలో భాషా వినియోగాన్ని అర్థం చేసుకోవడానికి కమ్యూనిటీలతో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. భాషా వైవిధ్యాన్ని డాక్యుమెంటేషన్ చేయడం, పరిరక్షించడం ద్వారా తోడా, బడగ, కోట భాషల పద్ధతులను కూడా పోల్చి చూస్తారు. హెచ్‌సీయూలోని సెంటర్ ఫర్ అప్లయిడ్ లింగ్విస్టిక్స్ స్టడీస్, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్. రమేష్, బెల్జియంలోని ఘెంట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డానిలియా డిసిమోన్ ఈ నీలగిరి పురావస్తు ప్రాజెక్టు పరిశోధనలో భాగస్వాములుగా వ్యవహరించనున్నారు.



పాఠశాల విద్యార్థులు నిర్మించిన బ్రిడ్జి

విద్యార్థులు నిర్మించిన బ్రిడ్జి

● బాలల దినోత్సవం సందర్భంగా ప్రారంభం

గచ్చిబౌలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మి యాపూర్‌లోని ఫౌంటెన్‌హెడ్ గ్లోబల్ పాఠశాల లో సామాజిక సేవలో భాగంగా పాఠశాలకు సమీపంలోని మీదికుంట చెరువు అభివృద్ధికి పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ముందుకొచ్చింది. అందులో భాగంగా గతంలో చెరువు పరిసరాలను శుభ్రం చేసి చెత్తాచెదారం, వ్యర్థాలు తొలగించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులతో కలిసి విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. దీనికి విద్యార్థులు, సేవ్ వాటర్ అండ్ నేచర్ ఎన్‌జీఓ అందించిన సహకారంతో వాకింగ్ బ్రిడ్జిని నిర్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు విద్యార్థి దశనుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం జరుగుతుందన్నారు. చెరువు మరింత అభివృద్ధికి మా వంతు కృషి చేస్తామన్నారు.

యువకులను బెదిరించి దారి దోపిడీ

హైదర్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళ్తున్న యువకులను అడ్డగించి నిర్మానుష ప్రదేశంలోకి తీసుకెళ్లి వారిని బెదిరించి వారి వద్ద నుంచి విలువైన వస్తువులను దొంగలు దోపిడీ చేశారు. కేపీహెచ్‌బీ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట మురహరిశెట్టి అంకమ్మరావు(31) బుధవారం రాత్రి ఖైతలపూర్‌కు వెళ్లి తిరిగి జగద్గిరిగుట్ట వెళ్లేందుకు 11.30 గంటల సమయంలో కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-4 రోడ్డులో వస్తున్నాడు. లోదా అపార్ట్‌మెంట్స్ వద్ద నిర్మానుష్య ప్రాంతంలో కొందరు ట్రాన్స్‌జెండర్స్ అతడిని అడ్డుకొన్నారు. అదే సమయంలో వారి వెనుకనుండి మాస్క్ ధరించివున్న నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చి అతనిని బెదిరించి అతని వద్ద నుంచి 1.5 తులాల బంగారు గొలుసు, సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యారు.

● మరో కేసులో...

కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నెంబర్-4లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వెంకట సురేష్(28) ఈనెల 9న తన స్నేహితుడు జగదీష్‌ను కలిసేందుకు హైదరాబాద్‌కు వచ్చాడు. వీరు మూడు రోజులుగా నగరంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి కేపీహెచ్‌బీ కాలనీ 4వ రోడ్‌లో వస్తుండగా రెండు వాహనాలపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు వారిని కత్తులతో బెదిరించి డబ్బులు డిమాండ్ చేయగా వారి వద్ద లేక పోవడంతో సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యారు. అయితే రెండు ఘటనలు ఒకే విధఃగా ఉండటంతో ఒకే ముఠా ఈ ఘటనకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో

పార్కులు అధ్వానం

● పేరుకుపోయిన చెత్తాచెదారం
● పట్టించుకోని అధికారులు
● అభివృద్ధి చేసి వాచ్‌మన్‌లను ఏర్పాటు చేయాలి: స్థానికులు



చెత్తాచెదానంతో నిండిన వాకింగ్ ట్రాక్



విరిగిపోయిన బెంచీలు

గచ్చిబౌలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన రెండు పార్కులు నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. ఇటీవల జీహెచ్ఎంసీ పరిధిలో పార్కులను అభివృద్ధి పేరుతో పచ్చదనం ఉట్టిపడేలా అభివృద్ధి చేస్తూ థీమ్ పార్కుల పేరుతో లక్షలు వెచ్చించి కొత్తగా అభివృద్ధి చేస్తున్నారు. గతంలో అభివృద్ధి చేసిన పార్కులు నిర్వహణ లేక దుమ్ము, వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి కంపు కొడుతున్నాయి. పార్కుల నిర్వహణను అధికారులు పట్టించుకోక పోవడంతో పార్కులు ఈ స్థితికి చేరుకున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఇళ్ల మధ్యలో ఉన్న పార్కులు ఉండటంతో గతంలో స్థానికులు, వృద్ధులు సాయంత్రం సమయంలో పిల్లలతో పార్కులకు వచ్చి సేద తీరే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పార్కుల నిర్వహణ కోసం కార్మికులను ఏర్పాటు చేశారు. ఆ కార్మికులు ప్రస్తుతం కనిపించడం లేదు. దీంతో పార్కులు అధ్వానంగా మారాయి.



కూలడానికి సిద్ధంగా ఉన్న పార్కు గేటు గోడ

పార్కులను అభివృద్ధి చేయాలి

కాలనీలో ఉన్న పార్కులను అభివృద్ధి చేసి పచ్చదనం పెంచి, నిర్వహణ సరిగా చేయాలని, పచ్చదనం ఉండేవిధంగా, ప్రజలకు ఆహ్లాదం పంచే విధంగా తయారు చేయాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. లింగంపల్లి డివిజన్‌లోని హుడా ట్రేడ్ సెంటర్, నల్లగండ్ల కూరగాయల మార్కెట్ సమీపంలో ఈ రెండు పార్కులకు ప్రజల ఎక్కువగా వస్తుంటారు. మార్కెట్‌కు వచ్చే వారు పార్కులో కొంతసేపు సేదతీరేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

వాకింగ్ ట్రాక్‌లపై చెత్తచెదారం

పార్కులోని వాకింగ్ ట్రాక్‌లో చెత్తాచెదారం గడ్డి పేరుకుపోయి అధ్వానంగా మారాయి. కాలనీలో ఎక్కువగా అపార్టుమెంట్‌లు ఉండటంతో ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేవారు. ప్రస్తుతం వారంతా రోడ్లపైనే వాకింగ్ చేస్తున్నారు.

వాచ్‌మన్‌లను ఏర్పాటు చేయాలి

పార్కులో రాత్రిపూట మందుబాబులు తిష్టవేయకుండా అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని. పార్కు ప్రహరీకు మరమ్మతులు చేసి కాపల దారులను ఏర్పాటు చేయాలి. ఈ రెండు పార్కుల్లో లైటింగ్, వ్యవస్థలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు

హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలోని పార్కుల అధ్వాన స్థితిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. దీంతో పార్కులు అధ్వానంగా మారాయి. చెత్తా, వ్యర్థాలు పెరుకుపోయి పార్కులో అడుగుపెట్టే పరిస్థితి లేదు. రాత్రి సమయాల్లో మందుబాబులు అడ్డాగా మారింది. ఇప్పటికైన అధికారులు స్పందించి పార్కులను అభివృద్ధి చేసి నిర్వహణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి.

- రవియాదవ్, స్థానికుడు

మా దృష్టికి రాలేదు..

తాను ఇటీవలే బదిలీపై వచ్చాను. హుడా పార్కుల విషయం తన దృష్టికి రాలేదు. త్వరలోనే పార్కులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పార్కులో పచ్చదనం పెంపొందించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

- ఎండీ యూసఫ్, బయోడైవర్సిటీ అధికారి

ఘనంగా బాలల దినోత్సవం



కార్యక్రమంలో నీటి వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్



శంషిగూడ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గచ్చిబౌలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులు గురు విష్ణు...గురు బ్రహ్మ బదులు గూగుల్ విష్ణు..గూగుల్ బ్రహ్మ అని జపిస్తున్నారని నీటి వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాశ్ అన్నారు. గురువారం కొండాపూర్‌లోని సంస్కృతి పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేడు ప్రతి ఒక్కరు గూగుల్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, ఇది మంచిదే అయినపట్టికి కొందరు విద్యార్థులు, వ్యక్తులు చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని, మంచికి మాత్రమే గూగుల్‌ను వాడాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలన్నారు. సాంకేతిక విద్యను కొంత వరకే పరిమితం చేయాలని ఆయన విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ సంస్కృతి విద్యా సంస్థలు విద్యార్థులను తీర్చిదిద్దుతున్న తీరు అభినందనీయమన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల చైర్మన్ లక్ష్మణ్, డైరెక్టర్ భవాని, పాఠశాల ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హాఫీజ్‌పేట డివిజన్‌లో

హాఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని ఫౌంటెన్‌హెడ్ పాఠశాలలో చైర్మన్ మేఘన, డైరెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వారు మాట్లాడుతూ సామాజిక సేవలో పిల్లలను భాగస్వాములను చేస్తు ముందుకెళ్తనమన్నారు.

పాఠశాల సమీపంలోని చెరువు వద్ద రాకపోకలకు ఆటంకంగా ఉండటంతో, ఆ మురుగులో నుంచే స్థానికులు రాకపోకలు సాగించేవారు. దీంతో పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు సేకరించిన విరాళాలతో వాకింగ్ బ్రిడ్జిను నిర్మించారు. ఈ బ్రిడ్జిని బాలల దినోత్సవం సందర్భంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

బీజేపీ కార్యాలయం ప్రారంభం

రాయదుర్గం, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలో డివిజన్ ఉపాధ్యక్షుడు శివసింగ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ పార్టీ కార్యాలయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకు పార్టీ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, నియోజకవర్గ, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో లక్ష దీపోత్సవం

చందానగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చందానగర్ లక్ష్మీగణపతి ఆలయంలో లక్ష దీపోత్సవం వైభవోపేతంగా కొనసాగుతుంది. స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



లక్ష దీపోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు

కేపీహెచ్‌బీ ఎల్ఐజీ ప్లాట్స్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం

హైదర్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎంఐజీ ప్లాట్స్ అపార్ట్‌మెంట్స్‌లోని ఎంఐజీ ప్లాట్స్ అపార్ట్‌మెంట్స్‌లోని ఎంఐజీ బ్లాక్ 9 గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఓ ఇంటిలో స్వల్ప అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కూకట్‌పల్లి అగ్నిమాపకశాఖ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి ఎంఐజీ ప్లాట్స్‌లో ఓ ఇంటిలోనివారు బెడ్‌రూమ్‌లో నిద్రిస్తుండగా వంటగదిలోని ఫ్రిడ్జ్ ఉంచిన బోర్డ్‌లో విద్యుత్ షాక్‌తో మంటలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా హుటాహుటిన అక్కడకు చేరుకుని పొగతో ఇబ్బంది పడుతున్న 15మంది అపార్ట్‌మెంట్ వాసులను బయటక తీసుకువచ్చారు. ఫైర్ ఇంజీన్ సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్ని ప్రమాదంలో రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు సమాచారం.



అపార్ట్‌మెంట్ వాసులను బయటకు తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది



సమావేశంలో పాల్గొన్న ఉపకమిషనర్లు, ఎన్యూమరేటర్లు

ఇంటింటి సమగ్ర సర్వేపై సమావేశం

చందానగర్, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మాకంగా తీసుకున్న ఇంటింటికి సమగ్ర సర్వేను ఎలాంటి తప్పులు లేకుండా కచ్చితత్వం ఉండాలని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి అన్నారు. చందానగర్ సర్కిల్ కార్యాలయం పక్కన ఉన్న కల్యాణ మండపంలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లతో సమావేశం నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ వెంకటరామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటింటికి సర్వే ఫారాలను ఏరోజుకారోజు సూపర్‌వైజర్లు వారికి కేటాయించిన బాక్సుల్లో ఫారాలను భద్ర పరచాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఉషారాణి, ఈఈ కేవీఎస్ఎన్ టి.రాజు, ఎఎంసీ, సూపర్‌వైజర్లు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక శోభతో ఆయ్యప్ప ఆలయం

● శబరిమలైను తలపిస్తున్న చందానగర్ జగత్‌రక్షకా శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయం

చందానగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శబరిమల ఆలయంలో ఆగమనయుక్త పూజావిధానాలు ఎలా జరుగుతాయో అదే ప్రకారం చందానగర్‌లోని పీజేఆర్ఎన్‌క్లేవ్ కాలనీలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో కూడా అదేవిధంగా కొనసాగుతున్నాయి. స్వామియే శరణం అయ్యప్ప అంటూ ఈ ఆలయం మార్మోగుతోంది. ఆధ్యాత్మిక కేంద్రంగా దినదినం విరాజిల్లుతోంది. రెండు దశాబ్దాల క్రితం ఆలయాన్ని నిర్మించారు. ఈ ఏడాది నవంబర్ 17నుంచి మూడు రోజుల పాటు ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతాయి. 108 రోజుల పాటు అయ్యప్ప మాలాధరణ భక్తులకు ఉచితంగా భిక్ష, అల్పాహారం అందజేస్తారు.



చందానగర్‌లోని అయ్యప్ప ఆలయం



అయ్యప్ప మాలాధారణ భక్తులకు భిక్ష

● ఆలయ నిర్మాణం

2008లో స్వర్గీయ రాజబహుదూర్ నందగోపాల్‌నాయుడు గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయం నిర్మించారు. ఆయన మృతి చెందిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని దినదినాభివృద్ధి చేశారు. విజయ గణపతి, సుబ్రమణ్యేశ్వరస్వామి, నాగరాజుతో స్వామివారి ఆలయాలు నిర్మించారు. ఏకశిల పదెనేట్టండిని విశాఖశారద పీఠాధిపతి స్వరూపనందేంద్ర మహాస్వామి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

● ఆలయంలో ఏడాది పొడవున విశేష పూజలు జరుగుతున్నాయి. ఉగాది, శ్రీరామనవమి సుమారు 15 రోజుల పాటు ప్రతి ఉత్తర నక్షత్రం రోజున అయ్యప్పస్వామికి, సంకటహరి చతుర్థికి గణపతికి పూజలు చేస్తారు. ఈ ఆలయంలో మాలాధరణ చేస్తే అంతశుభం జరుగుతుందనే నమ్మకంతో అయ్యప్పస్వాములు మాలాధారణ చేస్తారు.

● ఆలయ కమిటీ సభ్యులుగా వి.రవి, కె.సత్యనారాయణ, జి.రామచందర్, రామకృష్ణరెడ్డి ఉంటూ ఆలయాన్ని దినదినాభివృద్ధి చేస్తున్నారు. ఆలయం అభివృద్ధి కోసం చందాలు వసూలు చేయ్యలేదు. స్వచ్ఛందంగా భక్తులు ఆలయానికి వచ్చి విరాళాలు అందజేశారు.